# త్రి'క'విక్రముడి మూడో అడుగు

వర్చస్వి సాహితీలోకాన లబ్ధ ప్రతిష్ఠుడు. కథకుడిగా (వర్చస్వీయం-1997), కవిగా (లోకాస్సమస్తా- 2012) అచ్చోసుకున్న కార్టూనిస్టుడు. వర్చస్వికి తన ఎరుకలోని లోకాన్ని వ్యంగ్యం మేళవించి రంగుల చిత్రాలుగా వెలువరించడం మూడు దశాబ్దాలకు పైబడిన అలవాటు; వర్చస్వి రాతకీ, గీతకి నేనూ అభిమానినే; ఈ కార్టూన్లు రంగుల పుస్తకంగా ఈ రూపంలో తేవడం నా ఆకాంక్ష.

పదికాలాలపాటు ఉంచుకోదగ్గ పుస్తకమేదైనా ఉంటుందంటే అది మనకు విజ్ఞానాన్ని అందించేదైనా అయివుండాలి లేదా వినోదాన్నైనా పంచగలగాలి. వ్యంగ్యచిత్రం సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూనే సునిశితంగా ఆలోచనలనూ రేకెత్తిస్తుంది. అలాంటి చిత్రావళి మనసుకు మృష్టాన్నభోజనమే. గతంలో తన కథలతో కవితలతో అలరించిన వర్చస్వి కార్టూనిష్టాగరిష్ఠుడు గానే ప్రఖ్యాతుడు. తన జీవితానుభవాల్ని రంగరించి గరిష్ఠంగా గీసినవి వేనవేలు. అందులోంచి సమకాలీనతకు పెద్దపీట వేస్తూ ఎంపిక చేసిన టూన్స్ ఈ పుస్తకం నిండా. పైపెచ్చు తన స్మార్ట్ ఫోన్ పైన స్టైలస్ ఊతంతో గీసినవీ- రాసినవీనూ, తన నిర్లక్ష్యపుటందమైన వంపులగీతకు టెక్నాలజీ సొబగులు సమకూరాయి; ఆ రకంగానూ ఇవి ప్రత్యేకమైనవి. సృజనకారుడి తపన రంజింపచేయడమే ఐనప్పుడు ఈ పుస్తకం ఆ లక్ష్యసిద్ధి వైపు వేసిన మూడో అడుగు.



shriyasaswi@gmail.com

కథతో మొదలెట్టి, కవిత్వంతో పలవరించినా, తన బలం కార్టూన్ అని నమ్మబలుకుతున్నాడు. మనకు మరో రసాతలాధిపత్యం కట్టబెడుతున్నాడు. ఈ పుస్తకాన్ని ఆస్వాదించాక, వర్చస్వి కవిత్వం, కథ చదవాలనిపిస్తే అది నా తప్పు కాదు. ఈ పనిని తలకెత్తుకున్నందుకు ఎమ్మెస్కో వారికి నా కృతజ్ఞతలు.

వేల మాటలు చెప్పలేనిది ఓ ఛాయాచిత్రంలో కనిపించొచ్చు, వంద ఫోటోలలో అవగతమవనిది ఒక కార్టూన్తో బోధపడొచ్చు. కార్టూన్లలో వర్చస్విని వేరయా అన్నట్లున్నాయ్ ఇందులోవి. ఈ నవ్వుల జల్లుల్ని పంచుకోవాలి గానీ వార్డ్ రోబుల్లో ఉంచేసుకోకండేం? మనసారా ఆస్వాదించాక ఏ మిత్రుడికో కానుకగా ఇవ్వండి. మరో రెండు కొనుక్కోండి, లేదా నన్ను కనుక్కోండి.. ఒకటి పాత మిత్రుడికి ఇచ్చినా, పరిచయం కాబోయే కొత్తమిత్రుల కోసం ఒకటి అట్టేపెట్టండి.. ఏ పెళ్ళికో–పుట్టినరోజుకో మిత్రుల్ని ఆనందంగా ఉంచడానికి ఇంతకంటే బహుమతి ఉంటుందా! ఉభయతారకం కదూ!! –*యశస్వి*